VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 47

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

శుక్రవారం 17 జూలై 2026

## భవిష్యత్తులో వీజీఎఫ్ విప్లవం

● పీపీపీ ప్రాజెక్టులతోనే వేగంగా అభివృద్ధి ● ప్రతీ ప్రభుత్వ శాఖకూ ఓ ఫైనాన్షియల్ ప్లాన్ ● నిరర్ధకంగా ఉన్న ప్రభుత్వ ఆస్తుల సద్వినియోగం ● మెడికల్ కాలేజీల నిర్మాణంలో పీపీపీ విధానంపై కేంద్రం ప్రశంసలు ● పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0 మార్గదర్శకాలు త్వరలో విడుదల ● పీపీపీ ప్రాజెక్టులు, పీపీపీ విధానంపై సీఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి,కలంకౌంటర్ :** భవిష్యత్తులో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌తో కూడిన ప్రాజెక్టులే కీలకంగా మారనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గతంలో ఆర్ధిక సంస్కరణలు, ప్రస్తుతం మౌలిక సదుపాయాల విప్లవం దేశంలో నడుస్తోందని అన్నారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతోనే వివిధ రంగాల్లో ప్రాజెక్టులు చేపట్టి వేగంగా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందని సీఎం అన్నారు. రాష్ట్రంలో పీపీపీ కింద చేపట్టిన ప్రాజెక్టులు, ప్రభుత్వం చేస్తున్న వ్యయం తదితర అంశాలపై గురువారం ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం పోర్టులు, షిప్ యార్డులు, ఎయిర్ పోర్టులు, పర్యాటక ప్రాజెక్టులు సహా మొత్తం 260 ప్రాజెక్టులను పీపీపీ కింద చేపట్టినట్టు ఆర్ధిక శాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పరిశ్రమలు, మౌలికసదుపాయాలు, పురపాలక, టూరిజం, వైద్య కళాశాలలు, రహదారులు, సౌర విద్యుత్ లాంటి రంగాల్లో రూ.1,23,229 కోట్ల విలువైన ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం అన్ని పీపీపీ ప్రాజెక్టులనూ సస్టెయినబుల్ మోడల్‌లో అభివృద్ధి చేయాలని... ప్రతీ ప్రాజెక్టు వద్దా ఆర్ధిక కార్యకలాపాలకు అవకాశం ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. వివిధ ప్రాజెక్టులకు కేంద్రం ఇచ్చే అర్బన్ ఛాలెంజ్ ఫండ్ లాంటి వాటిని కూడా సమర్ధంగా వినియోగించుకోవాలని అన్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను సమర్ధంగా నడిపేందుకు అవసరమైన మెకానిజమ్ సిద్ధం చేయాలని సూచించారు. కోస్టల్ టూరిజం ప్రాజెక్టుల్లో స్థానిక మత్స్యకారులను కూడా భాగస్వాములను చేసి వారికి ప్రయోజనాలు కలిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 21 ప్రధాన దేవాలయాల వద్ద పబ్లిక్ టచ్ పాయింట్ల వద్ద మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆర్ధిక కార్యకలాపాలకు అవకాశాలు కల్పించాలన్నారు. విజయవాడ, తిరుపతిలోని వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు రూ.178 కోట్ల వీజీఎఫ్‌ను కేంద్రం ఇస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మెడికల్ కాలేజీలకు రూ.1,468 కోట్ల వీజీఎఫ్ రానుందని.. ఈ ప్రాజెక్టులు చేపట్టిన విధానంపై కేంద్ర ఆర్ధిక వ్యవహారాల విభాగం ప్రశంసించిందని అధికారులు తెలిపారు.


**వచ్చే కేబినెట్‌కు నూతన విధానం..** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం-వీజీఎఫ్ పాలసీ 1.0 ను వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చకు పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు విడుదల చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వేర్వేరు విధానాలను కూడా అధ్యయనం చేయాల్సిందిగా సూచించారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాల మేరకు ప్రతీ ఏటా పీపీపీ కింద రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. రాష్ట్రంలోని విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లలో పెద్దఎత్తున మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కింద వీటిని చేపట్టాల్సి రావొచ్చని సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం స్వర్ణాంధ్ర విజన్ మైక్రో, మ్యాక్రో లక్ష్యాలకు అనుగుణంగా ప్రాజెక్టులు చేపట్టాలని అన్నారు. ఎప్పటికప్పుడు లోటుపాట్లను సరిదిద్దుకుంటూ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో పరిశ్రమలకు సరఫరా చేసే నీటి ద్వారా జలవనరుల శాఖకు ఆదాయం వస్తుందని... సాగునీటి సంఘాలు కూడా ఈ ప్రక్రియలో కీలకంగా ఉంటాయన్నారు. ప్రతీ ప్రభుత్వ శాఖ ఫైనాన్షియల్ ప్లాన్ ను తయారు చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా ఆదాయ మార్గాలను నిర్దేశించుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖలు పెట్టుబడిదారుల నుంచి విశ్వాసాన్ని కలిగించేలా పీపీపీ ప్రాజెక్టులను చేపట్టాలని సీఎం సూచించారు. ఏ రంగమైనా ఏపీకి ఫస్ట్ మూవర్ అడ్వాంటేజి రావాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

**ప్రభుత్వ ఆస్తుల సద్వినియోగం..** ప్రభుత్వం వద్ద నిరర్ధకంగా ఉన్న ఆస్తులను అవకాశాలుగా మలచుకోవాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని అన్ని బస్టాండ్ల వద్ద ప్రభుత్వానికి ఉన్న భూములను వాణిజ్య పరంగా వినియోగించుకునే అవకాశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పంప్డ్ స్టోరేజీ, సౌరవిద్యుత్ ప్రాజెక్టులు కూడా పీపీపీ కింద చేపట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గనులు, నెడ్ క్యాప్, పర్యాటకం, లాజిస్టిక్స్ రంగాల్లో భారీగా ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉందని సీఎం అన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ హాస్టళ్లలో ఉన్న విద్యార్థుల సంఖ్యను రెట్టింపు చేసేందుకు ఆలోచన

- 2లో

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ని పరామర్శించిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్





**హైదరాబాద్,కలంకౌంటర్ :** కుడి భుజానికి శస్త్ర చికిత్స చేయించుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పరామర్శించారు. గవర్నర్ గురువారం ఉదయం హైదరాబాద్ లోని పవన్ కళ్యాణ్ నివాసానికి విచ్చేశారు. ఆయనతో మాట్లాడి శస్త్ర చికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య నిపుణుల సూచనలు పాటించాలని చెప్పారు. త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో విధుల్లోకి రావాలని ఆకాంక్షించారు.

**పవన్ కళ్యాణ్ లైబ్రరీ తిలకించిన జస్టిస్ అబ్దుల్ నజీర్..** పవన్ కళ్యాణ్ స్వగృహంలో ఉన్న లైబ్రరీని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ తిలకించారు. లైబ్రరీలోని పలు పుస్తకాలను పరిశీలించారు. ప్రఖ్యాత రచయితలు, స్కాలర్స్, విశ్లేషకులు, పబ్లిక్ పాలసీ మేకర్స్ రాసిన పుస్తకాలు పరిశీలించారు. వాటి గురించి పవన్ కళ్యాణ్ తో ఆసక్తిగా చర్చించారు. పవన్ కళ్యాణ్ కోరడంతో ఓ పుస్తకంపై జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆటోగ్రాఫ్ చేశారు. గౌరవ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఎంతో ఆప్యాయతతో వచ్చి పరామర్శించినందుకు పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## 'జగన్ 2.0 సూపర్ యాప్'ను ఆవిష్కరించిన వైఎస్ జగన్

● వైసీపీ కుటుంబ సభ్యుల కోసమే ఈ కొత్త యాప్ అన్న జగన్ ● తాడేపల్లిలో జరిగిన పార్లమెంటరీ పార్టీ భేటీలో ప్రారంభం ● యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపు ● పార్టీ బలోపేతానికి డిజిటల్ వ్యూహంతో ముందుకెళ్తున్న వైసీపీ







**తాడేపల్లి,కలంకౌంటర్ :** వైసీపీ తమ శ్రేణులను బలోపేతం చేసే దిశగా డిజిటల్ బాట పట్టింది. ఇందులో భాగంగా, పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 'జగన్ 2.0 సూపర్ యాప్'ను గురువారం ప్రారంభించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన ఈ యాప్‌ను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ యాప్‌ను వైసీపీ కుటుంబం కోసం ప్రత్యేకంగా రూపొందించినట్లు పార్టీ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో వెల్లడించింది. కార్యకర్తలు ఈ యాప్‌ను వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరుతూ సంబంధిత లింక్‌ను కూడా పంచుకుంది. గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లలో ఇది అందుబాటులో ఉంటుందని, సులభంగా డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలుగా క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రచార చిత్రాలను విడుదల చేసింది. ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోలో, జగన్ పార్టీ నేతలను ఉద్దేశించి యాప్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సోషల్ మీడియాలో తమ కార్యకర్తలు పోస్ట్ చేసే కంటెంట్‌ను తొలగిస్తున్నారని, ఈ క్రమంలో పార్టీ కోసం ఒక ప్రత్యేక ప్లాట్‌ఫామ్‌ను సిద్ధం చేసుకున్నామని ఆయన తెలిపారు. ఈ యాప్ ద్వారా కార్యకర్తలు తమ అభిప్రాయాలను నిరభ్యంతరంగా వ్యక్తం చేయవచ్చని, పార్టీతో నిత్యం అనుసంధానమై ఉండవచ్చని పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా నాయకులు, కార్యకర్తలు నిరంతరం సమన్వయంతో ఉండే అవకాశం ఉంటుందని జగన్ తెలిపారు. పార్టీ నిర్వహించే విలేకరుల సమావేశాలు, పర్యటనలు, అధికారిక ప్రకటనలు వంటి సమాచారం అంతా ఈ యాప్ ద్వారా ప్రతి కార్యకర్తకు చేరువవుతుం దని అన్నారు. త్వరలోనే ఈ యాప్‌లో డిజిటల్ డైరీ సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన వెల్లడించారు.

## ఆక్వా, నాన్ ఆక్వా ప్రాంతంగా విడదీసింది జగన్ ప్రభుత్వమే

● కూటమి ప్రభుత్వం రాగానే అందరికీ విద్యుత్ సబ్సిడీ పునరుద్ధరించాం -ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అమరావతి,కలంకౌంటర్ :** ఆక్వా రైతుల విద్యుత్ సబ్సిడీ విధానాన్ని నిర్వీర్యం చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇప్పుడు ఆక్వా రైతుల గురించి మాట్లాడటం ఆశ్చర్యకరమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. ఈ మేరకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఓ నోట్ ను విడుదల చేశారు. జగన్ ప్రభుత్వ హయాంలోనే ఆక్వా ప్రాంతాన్ని ఆక్వా, నాన్ ఆక్వా జోన్‌లుగా విభజించి వేలాది మంది రైతులను విద్యుత్ సబ్సిడీకి దూరం చేశారని మంత్రి పేర్కొన్నారు. జగన్ రెడ్డి తీసుకొచ్చిన ఈ విధానంతోనే ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ విధానాన్ని సరిదిద్దుతూ అర్హులైన ఆక్వా రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించి ప్రతి అర్హులైన రైతన్నలకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న కూటమి ప్రభుత్వం వ్యవసాయ రైతులతో పాటు ఆక్వా రైతులు, చేనేత కార్మికులు, స్వర్ణకారులు, నాయి బ్రాహ్మణులకు కూడా విద్యుత్ సబ్సిడీలు అందిస్తోందని మంత్రి గొట్టిపాటి వివరించారు. వివిధ వర్గాల జీవనోపాధికి అండగా నిలిచేలా విద్యుత్ రాయితీలను కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో విద్యుత్ రంగంతో పాటు ఆక్వా రంగం, ఇతర కీలక వ్యవస్థలను వైఎస్సార్సీపీ ప్రభుత్వం దెబ్బతీసిందని మంత్రి ఆరోపించారు. ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారం చేస్తూ జగన్ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. జగన్ మోహన్ రెడ్డి చేపడుతున్న యాత్రలు, పర్యటనలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాకుండా రాజకీయ స్వలాభం కోసమేనని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆయన స్పష్టం చేశారు.



# జగన్నాథుని ఆశీస్సులతో దేశమంతా సుభిక్షంగా ఉండాలి: పవన్ కల్యాణ్

- పూరీ జగన్నాథ్ రథయాత్రను పురస్కరించుకుని భక్తులకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు
- ప్రతి కుటుంబానికి స్వామివారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించిన పవన్
- ప్రతి ఇంటిని సుఖసంతోషాలతో నింపాలని ఆకాంక్ష



**విజయవాడ, కలంకౌంటర్ :** పవిత్రమైన పూరీ జగన్నాథుని రథయాత్రను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కల్యాణ్ భక్తులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. జగన్నాథుని ఆశీస్సులతో దేశమంతా సుభిక్షంగా, శాంతిసంతోషాలతో విలసిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ ఒక భక్తిపూర్వక సందేశాన్ని పంచుకున్నారు. పవిత్రమైన ఈ రథయాత్ర అనేది కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదని.. అది అచంచలమైన విశ్వాసానికి, భక్తికి, అలాగే భగవంతునికి, భక్తుడికి మధ్య ఉండే శాశ్వతమైన ఆధ్యాత్మిక అనుబంధానికి ప్రతీక అని పవన్ కల్యాణ్ అభివర్ణించారు. పవిత్ర రథాలపై స్వామివారు, అమ్మవారు ముందుకు సాగుతుండగా... ఆ జగన్నాథస్వామి, బలభద్రస్వామి, సుభద్రాదేవిల దివ్య ఆశీస్సులు ప్రతి ఒక్కరి హృదయానికి శాంతిని, ప్రతి కుటుంబానికి మానసిక బలాన్ని, ప్రతి జీవితానికి సరికొత్త ఆశను ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఆ కలియుగ దైవం మనందరినీ ఎల్లప్పుడూ ధర్మమార్గంలో నడిపించి, మన ఇళ్లను సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో నింపాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. దీనితో పాటు, సమాజానికి వినమ్రతతో, నిష్కల్మషమైన భక్తితో సేవ చేసేలా.. మనందరికీ అవసరమైన జ్ఞానాన్ని, ధైర్యాన్ని ఆ స్వామి ప్రసాదించాలని కోరారు. ఈ పవిత్రమైన రోజున జగన్నాథుని దివ్య అనుగ్రహం మన జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపి, శాంతి, ఐక్యత, ఆధ్యాత్మిక బలంతో కూడిన ఒక ఉన్నతమైన భవిష్యత్తు వైపు మన సమాజాన్ని నడిపించాలని ఆకాంక్షించారు.

# తిరుమలలో ఏమాత్రం తగ్గని రద్దీ... వెంకన్న దర్శనానికి 24 గంటల సమయం

- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ
- వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు
- నిండిపోయిన క్యూ కాంప్లెక్సులు
- శిలాతోరణం వరకు క్యూలైన్లు
- శ్రీవారిని దర్శించుకున్న 82 వేల మంది భక్తులు
- ఒక్కరోజే రూ. 3.76 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం



**తిరుమల,కలంకౌంటర్ :** తిరుమల గిరులపై భక్తుల రద్దీ కొనసాగుతోంది. శ్రీవారి సర్వదర్శనానికి ఏకంగా 24 గంటల సమయం పడుతుండటం రద్దీ తీవ్రతను తెలియజేస్తోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్సులోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు బయట శిలాతోరణం వరకు బారులు తీరాయి. దీంతో తిరుమల కొండ భక్తులతో కిటకిటలాడుతోంది. టీటీడీ వెల్లడించిన వివరాల ప్రకారం, నిన్న (జూలై 15) బుధవారం నాడు మొత్తం 82,255 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా 32,683 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. శ్రీవారి హుండీకి ఒక్కరోజే రూ. 3.76 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. బుధవారం నాడు 2.64 లక్షల మందికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. అదేవిధంగా, 4.43 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయించారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడిన 3,496 మంది భక్తులకు వైద్య సేవలు అందించినట్లు టీటీడీ పేర్కొంది. ప్రస్తుతం సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి దాదాపు 20 నుంచి 24 గంటల సమయం పడుతోందని, భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ యాత్రను ప్రణాళిక చేసుకోవాలని టీటీడీ అధికారులు సూచిస్తున్నారు.

# కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బ్రహ్మం చౌదరి త్వరగా కోలుకోవాలి: నారా లోకేశ్

- బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన బ్రహ్మం చౌదరి
- తాడేపల్లి మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స
- బ్రహ్మం చౌదరి భార్య శ్వేతను పరామర్శించిన లోకేశ్




**అమరావతి, కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి అకస్మాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై తాడేపల్లిలోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. తాజాగా ఎక్స్ వేదికగా స్పందిస్తూ... బ్రహ్మం చౌదరి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కొన్ని రోజుల క్రితమే బ్రహ్మం చౌదరి, గౌతమి శ్వేతల వివాహం వైభవంగా జరిగింది. ఈ కొత్త జంట పెళ్లి వేడుకకు మంత్రి నారా లోకేశ్ స్వయంగా హాజరై ఆశీర్వదించారు. పెళ్లయిన కొద్ది రోజులకే ఆయన ఇలా తీవ్ర అస్వస్థతకు గురికావడం పట్ల లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. బ్రహ్మం చౌదరి భార్య గౌతమీ శ్వేతను ఫోన్‌లో పరామర్శించానని లోకేశ్ తెలిపారు. "అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చాను. మణిపాల్ వైద్యులతో మాట్లాడి బ్రహ్మం చౌదరి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నాను. త్వరగా కోలుకునేలా మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరాను. ఆయనకు ఎలాంటి లోటు లేకుండా అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని, త్వరగా కోలుకునేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని వైద్య బృందాన్ని కోరాను" అని లోకేశ్ వివరించారు.

# ఆధ్యాత్మికత ఒక్కటే ఒత్తిడి తగ్గించే మంత్రం

- ఆధ్యాత్మికత ఒక్కటే ఒత్తిడి తగ్గించే మంత్రం
- సమాజాన్ని ప్రశాంతంగా ఉంచే క్షేత్రాలు దేవాలయాలు
- అమరావతి విశ్వనగరిగా ఎదగాలని కోరుకున్న ముఖ్యమంత్రి
- రాజధానిలో జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- జగన్నాథస్వామి నామస్మరణతో హోరెత్తిన అమరావతి







**అమరావతి, కలంకౌంటర్ :** రోజువారీ జీవితంలో ఒత్తిడి తగ్గించే అత్యుత్తమ మంత్రం ఆధ్యాత్మికత ఒక్కటేనని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. సమాజాన్ని ప్రశాంతంగా ఉంచే క్షేత్రాలు మన దేవాలయాలని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. సమాజంలో మానవ సంబంధాలు తగ్గి సామాజిక మాధ్యమాల ప్రతికూల ప్రభావం పడుతోందని ఆయన అన్నారు. ఈ కారణంగా కొన్ని కుటుంబాల్లో ఆత్మహత్యలు, చిన్నారులపై అఘాయిత్యాల లాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. అందరి జీవితాల్లో ఒత్తిడి దూరమై మానసిక ప్రశాంతత చేకూరేందుకు ఆధ్యాత్మికతే మార్గమని ఆయన వివరించారు. అందుకే రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాలు నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. అమరావతి రాజధానిలోని వెంకటపాలెం నుంచి ఆయన జగన్నాథుడి రథయాత్రను ముఖ్యమంత్రి ప్రారంభించారు. పూరీ క్షేత్రంలో నిర్వహించే సంప్రదాయ క్రతువులను అనుసరిస్తూ జగన్నాథ, బలభద్ర, సుభద్రలతో కూడిన రథం ముందు సీఎం బంగారు చీపురుతో ఊడ్చి శుభ్రం చేసి స్వామివారి రథ యాత్రను తాడుతో లాగి ప్రారంభించారు. అమరావతి రాజధాని నగర బృహత్ ప్రణాళికతో కూడిన చిత్ర పటాన్ని శిరస్సుపై ధరించి విశ్వ నగరిగా అమరావతి ఎదగాలని ముఖ్యమంత్రి జగన్నాథ స్వామిని కోరుకున్నారు. అంతకు ముందు అక్కడే ఏర్పాటు చేసిన రథయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని సీఎం ప్రసంగించారు. భారతీయ సంస్కృతిలో భాగమైన ఉమ్మడి కుటుంబాలు రావాలని మైక్రో ఫ్యామిలీలు కాదని సీఎం అన్నారు. పూరీ క్షేత్రంలో నిర్వహించే జగన్నాథ రథ యాత్రకు ఎంతో ప్రత్యేకత ఉందని.. అలాంటి రథ యాత్రను అమరావతిలో తొలిసారి నిర్వహించటంపై సీఎం సంతోషం వ్యక్తం చేశారు. ప్రతీ ఏటా జగన్నాథ రథ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఇస్కాన్ సంస్థ ప్రకటించిందని అన్నారు. ఆధ్యాత్మికత, ప్రజా సేవలో ఇస్కాన్, అక్షయపాత్ర ఫౌండేషన్ లు పనిచేస్తున్నాయని తెలిపారు. దేశంలోని 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో 25 వేల పాఠశాలల్లో ఆహారం అందిస్తున్నాయన్నారు. ఏపీలోని 10 సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా 1.80 లక్షల మంది విద్యార్థులకు అక్షయపాత్ర ఫౌండేషన్ ఆహారం అందిస్తోందన్నారు. భారతీయ సంస్కృతిని కాపాడేందుకు ఇస్కాన్ లాంటి సంస్థలతో కలిసి పని చేస్తామన్నారు. జగన్నాథ రథ యాత్ర కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి పి.నారాయణ, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రవణ్ కుమార్ తదితర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

# రాష్ట్రాన్ని దోచేస్తున్నారు.. అప్పుల్లో రికార్డులు సృష్టిస్తున్నారు: జగన్

- జగన్ అధ్యక్షతన వైసీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం
- కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన జగన్
- ప్రభుత్వ భూములను దోచిపెడుతున్నారని మండిపాటు
- అమరావతిలో చదరపు అడుగుకు రూ. 20 వేలకు పైగా ఖర్చు చూపిస్తున్నారని ఆరోపణ
- ప్రతి రంగంలో మాఫియా రాజ్యమేలుతోందని విమర్శ



**అమరావతి,కలంకౌంటర్ :** వైసీపీ అధినేత జగన్ అధ్యక్షతన ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీలు అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సందర్భంగా దిశా నిర్దేశం చేసిన జగన్... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా ఉభయ సభల్లో గళం విప్పాలని పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు వైసీపీ మద్దతుగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై జగన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పోటీ పరీక్షలు నిర్వహించకుండానే డీఎస్పీ పోస్టులను భర్తీ చేయడం రాష్ట్ర చరిత్రలోనే ఒక పెద్ద స్కామ్ అని ఆరోపించారు. డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో తీవ్రమైన అవకతవకలు జరిగాయని విమర్శించారు. తమ వారికి ఉద్యోగాలు ఇచ్చుకోవడానికి ప్రత్యేకంగా జీవోలు తెచ్చి... ఆ పని పూర్తికాగానే జీవోలను రద్దు చేశారన్నారు. స్పోర్ట్స్ అసోసియేషన్లు సైతం వారి చేతుల్లోనే ఉన్నాయని, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్, జూడో సంఘానికి నారా లోకేశ్ తోడల్లుడు భరత్ గౌరవ అధ్యక్షుడిగా ఉన్నారని విమర్శించారు. రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా దోచిపెడుతున్నారని జగన్ మండిపడ్డారు. అమరావతి రాజధాని నిర్మాణంలో చదరపు అడుగుకు రూ. 20,000 పైనే ఖర్చు చూపిస్తూ దేశంలో ఎక్కడా లేని విధంగా దోపిడీ చేస్తున్నారని, భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్)కు ఒప్పుకోని రైతుల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "వైసీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు రూ. 5,000 కోట్ల విలువతో నిర్మితమైన రామాయపట్నం పోర్టును కేవలం రూ. 1,500 కోట్లకే ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం పెద్ద కుంభకోణం కాదా? ఇలాంటి ఆదాయ వనరులను ప్రైవేటుకు ఇస్తే రాష్ట్రానికి ఆదాయం ఎక్కడి నుంచి వస్తుంది?" అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అప్పులు చేయడంలో సరికొత్త రికార్డులు సృష్టిస్తోందని జగన్ ధ్వజమెత్తారు. ఎఫ్ఆర్‌బీఎం చట్టం పరిమితులను సైతం ఉల్లంఘించి గత రెండేళ్లలోనే రూ. 3.6 లక్షల కోట్ల భారీ అప్పులు చేశారని ఆరోపించారు. ఇంత అప్పు తెచ్చినా... ప్రజలకు, రాష్ట్రానికి చేసింది మాత్రం శూన్యమని విమర్శించారు. ఇసుక, మైన్స్, లిక్కర్ ఇలా ప్రతి రంగంలోనూ మాఫియా రాజ్యమేలుతోందని ఆరోపించారు.

# రాయలసీమ కరవుకు గోదావరి జలాలే శాశ్వత పరిష్కారం: సత్యకుమార్ యాదవ్

- పోలవరం ప్రాజెక్టును సందర్శించిన సత్యకుమార్, పురందేశ్వరి, మాధవ్ తదితరులు
- పోలవరం కోసం మరో రూ. 30 వేల కోట్లు ఇచ్చేందుకు కేంద్రం రెడీగా ఉందన్న సత్యకుమార్
- పోలవరంను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్న మాధవ్



**అమరావతి,కలంకౌంటర్ :** రాయలసీమ ప్రాంతంలో దశాబ్దాలుగా వేధిస్తున్న కరవు రక్కసిని తరిమికొట్టేందుకు గోదావరి జలాల తరలింపే శాశ్వత పరిష్కారమని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ భారీ ఆర్థిక మద్దతు ఇస్తోందని ఆయన కొనియాడారు. ఈరోజు జరిగిన పోలవరం ప్రాజెక్టు సందర్శన యాత్ర సందర్భంగా.. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలతో కలిసి మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రూ. 20,700 కోట్లను విడుదల చేసిందని సత్యకుమార్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి చేయడానికి మరో రూ. 30 వేల కోట్లు ఇచ్చేందుకు కూడా కేంద్రం అంగీకరించిందని వెల్లడించారు. ఈ సందర్శన యాత్ర ద్వారా ప్రాజెక్టులోని లోటుపాట్లను గుర్తించి త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. వైసీపీ అధినేత జగన్ గత ఐదేళ్ల పాలనలో పోలవరం ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అయినప్పటికీ ప్రస్తుతం ప్రాజెక్టుకు సంబంధించిన 80 శాతం పనులు పూర్తయ్యాయని ఆయన వివరించారు. పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా రాబోయే పది రోజుల్లోనే నీటిని విడుదల చేస్తామని పీవీఎన్ మాధవ్ ఈ సందర్భంగా కీలక ప్రకటన చేశారు. ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాలతో పాటు రాయలసీమను సైతం సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం పనులను శరవేగంగా పరుగులు పెట్టించేందుకు సిద్ధమవుతోంది.

# పీపీపీ ప్రాజెక్టులు, పీపీపీ విధానంపై సీఎం చంద్రబాబు సమీక్ష

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నామని.. పట్టణ ప్రాంతాల్లో రహదారులకు సమీపంలోనే మినీ టౌన్‌షిప్‌లా రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులను నైపుణ్యం ఉన్న మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందని సీఎం స్పష్టం చేశారు. ఐఐటీ, ఐఐఎం లాంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లోనూ చదివేలా వీరిని తీర్చి దిద్దాలని అన్నారు. ఈ సమీక్షకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆ శాఖ ఉన్నతాధికారులు పీయూష్ కుమార్, వి.వినయ్ చంద్, రోనాల్డ్ రోస్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, ఐఅండ్ ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు తదితరులు హాజరయ్యారు.

# భోగాపురం ఎయిర్‌పోర్ట్ రెడీ - కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

- నెల రోజుల్లో భోగాపురం ఎయిర్‌పోర్ట్ కార్యకలాపాలు ప్రారంభం
- ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు
- విమానాశ్రయ నిర్మాణ పనులు ఇప్పటికే పూర్తి
- అంతర్జాతీయ సర్వీసులకు కేంద్ర హోంశాఖ అనుమతి



**విజయవాడ, కలంకౌంటర్ :** ఉత్తరాంధ్ర ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం (అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం) కార్యకలాపాలు నెల రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఆగస్టు మధ్య నాటికి విమాన సర్వీసులు మొదలవుతాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. విమానాశ్రయ నిర్మాణ పనులు ఇప్పటికే పూర్తిగా పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రధాని పర్యటన తేదీ ఖరారైన వెంటనే, వాణిజ్య విమాన సర్వీసులను ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇటీవలే కేంద్ర హోం మంత్రిత్వ శాఖ భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు కీలక అనుమతులు మంజూరు చేసింది. ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్ కింద దీనికి కేటగిరీ-1 హోదా కల్పించడంతో, అంతర్జాతీయ విమాన సర్వీసులు నడిపేందుకు మార్గం సుగమమైంది. దేశంలో ఈ గుర్తింపు పొందిన 39వ విమానాశ్రయంగా భోగాపురం నిలిచింది. ఈ హోదాతో ఇక్కడ ఇమ్మిగ్రేషన్ సౌకర్యాలు ఏర్పాటు చేయవచ్చు. విజయనగరం జిల్లాలో జీఎంఆర్ గ్రూప్ ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ప్రాజెక్టు పనులు వేగవంతం కావడం, ఇప్పుడు కార్యకలాపాలకు సిద్ధమవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఉత్తమ ఫొటోగ్రాఫర్లకు జిల్లాస్థాయి పురస్కారాలు

- మూడు విభాగాల్లో ప్రపంచ ఫొటోగ్రఫీ డే పోటీలు
- ఎంట్రీలు పంపేందుకు చివరితేదీ ఆగస్టు 5
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,కలంకౌంటర్ :** ప్రతి ఫ్రేమ్ ఒక జ్ఞాపకం.. కాలం మరచిపోయినా... ఫొటో మాత్రం ఆ క్షణాన్ని సజీవంగా ఉంచుతుంది. మధుర క్షణాలను శాశ్వతం చేసే ఫొటోగ్రఫీలో విశేష ప్రతిభకనబరిచిన ఫొటోగ్రాఫర్లకు ఆగస్ట్ 19 న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ప్రపంచ ఫొటోగ్రఫీ సందర్భంగా నిర్వహించే పోటీలకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ లక్ష్మీశ సమాచార శాఖ అధికారులు, ఫొటో జర్నలిస్టులతో కలిసి గురువారం కలెక్టరేట్‌లో ఆయన ఛాంబర్ నందు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌టీఆర్ జిల్లా పరిధిలోని ఫొటో జర్నలిస్టులు, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు, స్టూడియో ఫొటోగ్రాఫర్లు పోటీల్లో పాల్గొనవచ్చునని.. ఫొటోగ్రాఫర్లు ఆగస్టు 5వ తేదీలోగా తమ ఎంట్రీలు పంపాల్సి ఉంటుందన్నారు. మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నామని.. మొదటి విభాగంలో జిల్లాకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ వారసత్వం, పర్యాటకం, సంస్కృతి అంశాల్లో ఫొటో ఎంట్రీలు పంపొచ్చన్నారు. రెండో విభాగంలో యువత, పీ4, ఆర్థికాభివృద్ధి-సంక్షేమం అంశాలు, మూడో విభాగంలో అత్యుత్తమ న్యూస్ ఫొటో పోటీ ఉంటుందన్నారు.

## శ్రీవారిని కోరిక కోరిన 3 రోజులకే అద్భుతం జరిగింది
## తిరుమలలో ఆసక్తికర విషయం చెప్పిన అయ్యన్నపాత్రుడు

● శ్రీవారిని కోరుకున్న 3 రోజులకే కుమారుడికి రాజ్యసభ సీటు వచ్చిందన్న స్పీకర్ అయ్యన్న ● వన్యప్రాణి సంరక్షణ కమిటీ ఛైర్మన్‌గా తిరుపతి జూపై సమీక్షకు శ్రీకారం ● సౌకర్యాల లేమితో తిరుపతి జూకు భారీగా తగ్గిన సందర్శకుల సంఖ్య ● టీటీడీ సహకారంతో జూపార్క్ అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తున్నట్లు వెల్లడి ● జూలో సమస్యలపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని స్పష్టీకరణ



**తిరుమల,కలంకౌంటర్ :** తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, తన రాజకీయ జీవితానికి, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. స్వామి వారిని తాను మనస్ఫూర్తిగా ఓ కోరిక కోరుకోగా, అది కేవలం మూడు రోజుల్లోనే నెరవేరిందని ఆయన తెలిపారు. అదే సమయంలో, ఏపీ అసెంబ్లీ వన్యప్రాణి సంరక్షణ కమిటీ ఛైర్మన్‌గా తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర జూలాజికల్ పార్క్ అభివృద్ధికి తన కార్యాచరణను వివరించారు. నేడు తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం అయ్యన్నపాత్రుడు మీడియాతో మాట్లాడారు. గతంలో తాను స్వామివారి దర్శనానికి వచ్చినప్పుడు రాజ్యసభ ఎన్నికలు ఇంకా జరగలేదని గుర్తుచేసుకున్నారు. "ఆ సమయంలో మీడియా మిత్రులు నన్ను ఏం కోరుకున్నారని అడిగారు. నా కుమారుడు విజయ్‌కు రాజ్యసభ సీటు రావాలని మొక్కుకున్నట్లు చెప్పాను. ఆశ్చర్యంగా, నేను ఇక్కడి నుంచి వెళ్లిన మూడో రోజే అతనికి రాజ్యసభ సీటు ఖరారైంది. అదంతా ఆ స్వామివారి దయ, ప్రజల ఆశీర్వాదమే" అని అయ్యన్నపాత్రుడు వివరించారు. అనంతరం తన అధికారిక హోదాలో తిరుపతి జూపార్క్ అభివృద్ధిపై ఆయన మాట్లాడారు. తాను 'ఏపీ అసెంబ్లీ వన్యప్రాణి - పర్యావరణ పరిరక్షణ కమిటీ'కి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నానని, ఈ కమిటీలో ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, నరేంద్ర వర్మ సభ్యులుగా ఉన్నారని తెలిపారు. ఇప్పటికే విశాఖపట్నం జూను సందర్శించామని, ఇప్పుడు తిరుపతి జూను పరిశీలించి ప్రభుత్వానికి ఒక సమగ్ర నివేదిక సమర్పించనున్నట్లు చెప్పారు. ఆసియాలోనే సుమారు 3 వేల ఎకరాల్లో విస్తరించి ఉన్న అతిపెద్ద జూ పార్క్ తిరుపతిలో ఉందని, కానీ దీనికి ఆదరణ కరవైందని అయ్యన్నపాత్రుడు ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రతిరోజూ దాదాపు 90 వేల మంది భక్తులు తిరుమల వస్తుంటే, వారిలో కేవలం 3 వేల మంది మాత్రమే జూను సందర్శిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం అక్కడ సరైన సౌకర్యాలు లేకపోవడమే" అని ఆయన పేర్కొన్నారు. జూపార్క్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, సందర్శకులను ఆకట్టుకునే ఏర్పాట్లు కొరవడ్డాయని అన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి టీటీడీ సహకారం తీసుకుంటామని అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. తిరుమలకు వచ్చే భక్తుల్లో కనీసం సగం మంది జూకు వచ్చినా, ఆదాయం పెరిగి పార్క్ నిర్వహణ సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. జూలో మౌలిక సదుపాయాలు ఎలా కల్పించాలి, నిధులు ఎలా సమకూర్చాలనే అంశాలపై త్వరలోనే జిల్లా కలెక్టర్‌తో సమావేశమై చర్చిస్తామన్నారు. తిరుపతికి వచ్చే కుటుంబాలు సరదాగా జూకు వచ్చి సేద తీరేలా, ఆనందంగా గడిపేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడమే తమ కమిటీ లక్ష్యమని ఆయన వివరించారు.

## ఆంధ్రప్రదేశ్ మీకు క్షమాపణ చెప్పాలి :
## గల్లా జయదేవ్‌ను ఉద్దేశించి మంత్రి నారా లోకేశ్ పోస్ట్

● తెలంగాణలో అమరరాజా సరికొత్త తయారీ కేంద్రం ● వైసీపీ హయాంలో అమరరాజాను తీవ్రంగా వేధించారన్న లోకేశ్ ● ఏపీలో మళ్లీ కీలకపాత్ర పోషించాలని ఆకాంక్ష




**అమరావతి, కలంకౌంటర్ :** తెలంగాణలో అమరరాజా గ్రూప్ సరికొత్త తయారీ కేంద్రాన్ని (గిగా ఫ్యాక్టరీ) ప్రారంభిస్తున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ ఆ సంస్థకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరరాజా సంస్థ ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేస్తూ మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా ఒక ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు. అమరరాజా అధినేత, మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌కు ఆయన బహిరంగంగా క్షమాపణలు చెప్పడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జగన్ హయాంలో సొంత రాష్ట్రంలోనే ఎంతో ఆదరణ, ప్రోత్సాహం దక్కాల్సిన అమరరాజా వంటి దిగ్గజ సంస్థ తీవ్ర వేధింపులకు గురైందని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వేధింపుల కారణంగానే ఆ సంస్థ ఏపీ వదిలి పక్క రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాల్సి వచ్చిందని పేర్కొన్నారు. "గత ప్రభుత్వ దుందుడుకు చర్యల వల్ల జరిగిన నష్టానికి గానూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మీకు క్షమాపణ చెప్పాలి" అంటూ అమరరాజా సంస్థ అధినేత, మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌ను ఉద్దేశించి లోకేశ్ బహిరంగంగా క్షమాపణలు కోరారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో ఆంధ్రప్రదేశ్ మళ్లీ పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా మారిందని లోకేశ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో అమరరాజా గ్రూప్ చేపట్టబోయే విస్తరణ పనుల్లో ఆంధ్రప్రదేశ్ మళ్లీ కీలక పాత్ర పోషించాలని, ఇక్కడ మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆయన ఆకాంక్షించారు.

**లోకేశ్ సోషల్ మీడియా పోస్టు ఇలా...** "జయదేవ్ గల్లా, ఆంధ్రప్రదేశ్ మీకు క్షమాపణ చెప్పి తీరాలి. గత నాలుగు దశాబ్దాలుగా అమరరాజా, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక విజయగాథల్లో ఒకటిగా మాత్రమే నిలవలేదు. అది మన రాష్ట్రానికి అంతకుమించి ఎంతో చేసింది. ప్రపంచ స్థాయి తయారీ పరిశ్రమను సృష్టించింది, వేలాది మందికి ఉద్యోగాలు కల్పించింది, చిత్తూరు జిల్లా పేరును, ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిని దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా నిలబెట్టింది. గత ప్రభుత్వ హయాంలో మీ సంస్థ ఎదుర్కొన్న వేధింపులు నిజంగా జరగకూడనివి. సొంత రాష్ట్రంలో పరిశ్రమ పెట్టి, అభివృద్ధి చేయాలనుకున్న ఒక పారిశ్రామికవేత్తకు ప్రోత్సాహం లభించాలి కానీ, బెదిరింపులు కాదు. ఆంధ్రప్రదేశ్‌లో పుట్టిన ఒక కంపెనీ, తన తదుపరి వృద్ధి కోసం మన రాష్ట్ర సరిహద్దులు దాటి చూడాల్సి రావడం నన్ను వ్యక్తిగతంగా ఎంతో బాధిస్తోంది. మేము ప్రజల నమ్మకాన్ని తిరిగి నిలబెడుతున్న ఈ తరుణంలో, నేను మీకు ఒక విషయం స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను: ఆంధ్రప్రదేశ్ మరోసారి పరిశ్రమలకు, వ్యాపారాలకు అనుకూలమైన రాష్ట్రంగా మారింది. అమరరాజా ప్రస్థానంలో అతిపెద్ద, అత్యంత విజయవంతమైన అధ్యాయాలు దాని ప్రయాణం ప్రారంభమైన ఈ రాష్ట్రంలోనే లిఖించబడతాయని నేను ఆశిస్తున్నాను. మా తలుపులు, మా హృదయాలు మీ కోసం ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయి. తెలంగాణలో మీరు ఏర్పాటు చేస్తున్న కొత్త పరిశ్రమకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు" అని తన సోషల్ మీడియా పోస్టులో లోకేశ్ పేర్కొన్నారు.

## సరికొత్త హంగులతో లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ ఎంపోరియం

● జూలై 17న మంత్రి ఎస్. సవిత చేతుల మీదుగా ప్రారంభం




**న్యూఢిల్లీ,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ లేపాక్షి ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని లిస్టేట్ ఎంపోరియా కాంప్లెక్స్ (బి-6)లిలో నూతన హంగులతో తీర్చిదిద్దిన లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ ఎంపోరియంను ఈ నెల జూలై 17వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు పునఃప్రారంభించనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విశ్వ మనోహరన్ తెలిపారు. ఈ ఎంపోరియంను రాష్ట్ర చేనేత, జౌళి, బీసీ సంక్షేమ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ చేనేత, హస్తకళల అభివృద్ధి సలహాదారు సుచిత్ర ఎల్లా, చేనేత, జౌళి (పరిశ్రమలు ఓ వాణిజ్య) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పీ. సిసోడియా, ఆంధ్రప్రదేశ్ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ పాల్గొననుండగా, ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారు. కన్నాట్ ప్లేస్‌లోని హనుమాన్ మందిర్ ఎదురుగా ఉన్న ఈ ఎంపోరియంను ఆధునిక హంగులతో పునరుద్ధరించి, ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ హస్తకళలను ఆకర్షణీయంగా ప్రదర్శించేలా తీర్చిదిద్దారు. ఈ పునఃప్రారంభంతో రాష్ట్ర హస్తకళలకు మరింత విస్తృత మార్కెట్ లభిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## విద్యా ప్రమాణాల పెంపునకు వినూత్న కృషి

● పదో తరగతి విద్యార్థులకు హిందీ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ
● ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రత్యేక అధ్యయన పుస్తకం ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,కలంకౌంటర్ :** పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించేలా వినూత్న కృషితో అధ్యయన పుస్తకాలను రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఈ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కలెక్టర్ లక్ష్మీశ.. విద్యాశాఖ అధికారులతో కలిసి గురువారం కలెక్టరేట్‌లో హిందీ స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా ముఖ్యమైన అంశాలను సమగ్రంగా పొందుపరిచిన ఈ స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుం దన్నారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు ఈ స్టడీ మెటీరియల్‌ను కూడా క్రమం తప్పకుండా అభ్యసిస్తే హిందీ సబ్జెక్టులో మంచి మార్కులు సాధించడంతో పాటు ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు వినూత్న బోధనా పద్ధతులను అవలంబించడంతో పాటు ఇలాంటి నాణ్యమైన అధ్యయన సామగ్రిని రూపొందించడం అభినందనీయమన్నారు. ఈ స్టడీ మెటీరియల్‌లో ముఖ్యమైన ప్రశ్నలు, సమాధానాలు, వ్యాకరణ అంశాలు, పరీక్షా విధానానికి అనుగుణమైన సూచనలు పొందుపరిచినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త రమేష్ బాబు, జిల్లా ఉమ్మడి పరీక్షల మండలి కార్యదర్శి ఉమర్ అలీ, హిందీ రిసోర్స్ పర్సన్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇస్రోలో వరుస రాజీనామాలు.. రంగంలోకి దిగిన కేంద్రం!

● కీలక మిషన్ల శాస్త్రవేత్తల రాజీనామాలపై కేంద్రం కఠిన నిర్ణయం ● శాస్త్రవేత్తల రాజీనామాలు ఇక సాధారణంగా ఆమోదించ వద్దని ఆదేశం ● తుది నిర్ణయం అంతరిక్ష శాఖే తీసుకోనుందంటూ అంతర్గత మెమో ● ఇస్రోలో 100-120 మంది వరకు రాజీనామా చేసినట్లు సమాచారం ● కీలక ప్రాజెక్టులపై ప్రభావం పడకుండా చర్యలు చేపట్టిన కేంద్రం ● పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొంటామన్న ఇస్రో ఛైర్మన్ నారాయణన్



**విజయవాడ, కలంకౌంటర్ :** ఇస్రోలో కీలక ప్రాజెక్టులపై పనిచేస్తున్న శాస్త్రవేత్తలు వరుసగా రాజీనామాలు చేస్తున్న నేపథ్యంలో కేంద్ర అంతరిక్ష శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గగన్‌యాన్‌తో పాటు ఇతర ప్రధాన మిషన్లలో ఉన్న శాస్త్రవేత్తల స్వచ్ఛంద పదవీ విరమణ, రాజీనామాలపై కఠిన నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చింది. జులై 14న విడుదల చేసిన అంతర్గత మెమో ప్రకారం.. గగన్‌యాన్, ఇతర కీలక ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న గ్రూప్-ఏ శాస్త్ర, సాంకేతిక సిబ్బంది రాజీనామాలు, స్వచ్ఛంద పదవీ విరమణ దరఖాస్తులను ఇకపై సాధారణంగా ఆమోదించరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులు పూర్తయ్యే వరకు అలాంటి అభ్యర్థనలను కేంద్రాల డైరెక్టర్లు ఆమోదించకుండా, తమ సిఫార్సులతో పాటు అంతరిక్ష శాఖకు పంపాలని ఆదేశించింది. తుది నిర్ణయం మంత్రిత్వ శాఖే తీసుకోనుంది. ఇస్రోలో ఇటీవల రాజీనామాలు పెరిగిన విషయాన్ని పరోక్షంగా అంతరిక్ష శాఖ గుర్తించింది. అయితే ఎంతమంది వెళ్లారనే అధికారిక వివరాలు వెల్లడించలేదు. 'టైమ్స్ ఆఫ్ ఇండియా'తో మాట్లాడిన ఇస్రో వర్గాల ప్రకారం కనీసం 100 నుంచి 120 మంది వరకు రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. వారిలో యూఆర్ఎస్‌సీ నుంచి సుమారు 80 మంది, వీఎస్ఎస్‌సీ నుంచి కనీసం 20 మంది ఉన్నట్లు సమాచారం. ఎల్‌వీఎం-3 ప్రాజెక్ట్ డైరెక్టర్ విక్టర్ జోసెఫ్, స్పాడెక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో పాటు చంద్రయాన్-3లో కీలకంగా పనిచేసిన ఓ యువ శాస్త్రవేత్త కూడా రాజీనామా చేసినట్లు వర్గాలు తెలిపాయి. ఈ పరిణామాలపై ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ స్పందించారు. రాజీనామాలు జరుగుతున్న మాట వాస్తవమేనని, అయితే ప్రతి సంస్థలో ఇలాంటి పరిస్థితులు ఉంటాయన్నారు. కీలక ప్రాజెక్టులకు ఒక్కసారిగా అంతరాయం కలగకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఎవరైనా వెళ్లినా వారి బాధ్యతలను మరొకరు చేపడతారని, పరిస్థితిని ఇస్రో సమర్థంగా నిర్వహిస్తోందని వెల్లడించారు. ఇస్రోలో మొత్తం 14,600 మందికి పైగా ఉద్యోగులు ఉన్నప్పటికీ, రాజీనామాలు చేసినవారిలో కీలక మిషన్లకు చెందిన అనుభవజ్ఞులు ఉండటమే ఆందోళన కలిగిస్తోంది. చంద్రయాన్-3లో ల్యాండింగ్ ప్రక్రియ ధ్రువీకరణకు అవసరమైన లక్షకు పైగా పరీక్షలు నిర్వహించి, దాదాపు 25 టెరాబైట్ల డేటాను సిద్ధం చేసిన ప్రాజెక్ట్ మేనేజర్ ఆదిత్య రాళ్లపల్లి కూడా సంస్థను వీడినట్లు సమాచారం. 2020లో జారీ చేసిన నిబంధనల ప్రకారం గ్రూప్-ఏ శాస్త్ర, సాంకేతిక సిబ్బంది రాజీనామాలను సంబంధిత కేంద్రాల డైరెక్టర్లే ఆమోదించే అధికారం ఉండేది. తాజా ఆదేశాలతో గగన్‌యాన్, ఇతర ప్రధాన మిషన్లలో పనిచేసే శాస్త్రవేత్తల విషయంలో ఆ అధికారాన్ని వెనక్కి తీసుకుంది. ఖాళీలను భర్తీ చేయడం కంటే అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలను భర్తీ చేయడం అంత సులభం కాదనే అభిప్రాయంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తాజా ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి.

## సాంకేతికత ఎంత పెరిగినా 'సంస్కృతే' మన గుర్తింపు

● అన్నమయ్య సంకీర్తనల కళా వైభవం ● సంగీతం వ్యక్తిత్వ వికాసానికి మార్గం ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





**విజయవాడ, కలంకౌంటర్ :** ఎంతటి ఆధునిక సాంకేతిక విప్లవం వచ్చినా, భావితరాలు గ్లోబల్ సిటిజన్స్‌గా మారినా.. మన సంస్కృతి, కళలే మన ఉనికికి ఆధారాలు" అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు డాక్టరు జి.లక్ష్మీశ అన్నారు. రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, కాకరపర్తి భావనారాయణ కళాశాల, అన్నమాచార్య భావన వాహిని సంయుక్త ఆధ్వర్యంలో డాక్టరు శోభారాజు ప్రత్యక్ష పర్యవేక్షణలో కేబీఎన్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన అన్నమాచార్య సంకీర్తనల శిక్షణ కార్యక్రమానికి కలెక్టరు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కేబీఎన్ కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాసు అధ్యక్షత వహించారు. అన్నమయ్య వారసత్వ సంపదను ఈ తరానికి అందించడంలో డాక్టరు శోభారాజు ఒక టార్చ్ బేరర్‌లా నిలిచారని కలెక్టరు కొనియాడారు. ఈరోజు సామాజిక మాధ్యమాల్లో రీల్స్, 30 సెకన్ల వీడియోల హడావుడిలో యువత ఆలోచనా శక్తి ఏకాగ్రత హరించుకుపోతున్న తరుణంలో.. సంగీతం అనేది జీవితానికి ఒక అద్భుతమైన శిక్షణ రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని పేర్కొన్నారు. సంగీతం కేవలం భక్తికో, పోటీ ప్రపంచంలో గెలవడానికో కాదు, అది మనిషిలో సహనాన్ని, క్రమశిక్షణను పెంచుతుందని స్పష్టం చేశారు. "నది తన నీటిని తాను తాగదు, చెట్టు తన పళ్లను తాను తినదు.. అలాగే శోభారాజు కూడా తన వద్దనున్న అన్నమయ్య సంకీర్తనల జ్ఞానాన్ని నిస్వార్థంగా నవతరానికి పంచుతున్నారు" అని కొనియాడారు. గంగ వద్దకు వెళ్తే పవిత్రమైన గంగాజలం దొరికినట్లే, సంగీతంతో పాటు సంస్కారాన్ని నేర్పించే ఇలాంటి మహానుభావురాలి దగ్గర విద్యను అభ్యసించడం విద్యార్థుల అదృష్టమని, ఇక్కడితో ఆగిపోకుండా ఈ విద్యను పదిమందికీ పంచాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ గారు నేతృత్వంలోని ప్రభుత్వం కళలకు, కళాకారులకు పెద్దపీట వేస్తోందని స్పష్టం చేశారు. ప్రతి కళాకారుడి ప్రతిభను గుర్తించి, వారికి సరైన అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం పూర్తి బాధ్యతతో పనిచేస్తోందని మాట ఇచ్చారు. అన్నమయ్య పాటను ప్రపంచవ్యాప్తం చేయడమే తన గమ్యమని డాక్టరు శోభారాజు తెలిపారు. యావజ్జీవితం ఆ శ్రీవారి స్వరసేవకే అంకితమన్నారు. ఈ ప్రయాణానికి కావలసిన శక్తి సామర్థ్యాలను ఆ వేంకటేశ్వరుడే తనకు అనుగ్రహించాడని అన్నారు. అందరూ అన్నమయ్య పాటలు పాడుకోవడమే కాకుండా, అందులోని జీవిత పాఠాలను దైనందిన జీవితంలో అనువదించుకుని, ఒక శృతిబద్ధమైన జీవితాన్ని గడపాలి" అని ఆకాంక్షించారు. డాక్టరు శోభారాజు గాత్రం, ఆ పాటలో ఆమె పలికించే భావ రసోత్పత్తి, శుద్ధమైన శృతి, స్వరం వింటుంటే సాక్షాత్తూ ఆ భగవంతుడే భువికి దిగివచ్చినట్లు అనిపించిందని కేబీఎన్ కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాసు అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నేటి తరం పిల్లలకు అన్నమాచార్యుల కీర్తనల విశిష్టత పట్ల అవగాహన కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతికశాఖ సంచాలకులు ఆర్.మల్లిఖార్జునరావు గీసిన అన్నమయ్య, వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని, కేబీఎన్ కళాశాల అధ్యాపకులు చలపతిరావు రచించిన పద్యభారతి గ్రంథాన్ని అతిధులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ కమిటీ పరిపాలన అధికారి డాక్టరు వి.నారాయణరావు, కేబీఎన్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టరు కప్పగంతు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవి విగ్రహావిష్కరణ




**మెంటాడ (విజయనగరం జిల్లా),కలంకౌంటర్ :** మెంటాడ హైస్కూల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అమర జీవి పొట్టి శ్రీరాములు స్మార్త సేవా సమితి ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో 54వ విగ్రహం ప్రారంభోత్సవ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ ముఖ్య అతిధి గా హాజరయ్యారు. ఈ కార్యక్రమం లో, పేరూరి గాంధీ , శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు అన్నవరం , ప్రాజెక్ట్ చైర్మన్ బండారు చంద్రశేఖర్ , వ్యవస్థాపక అధ్యక్షులు చెరుకూరి నాగరాజు , ప్రధాన కార్యదర్శి బత్తుల కామేష్, ఉపాధ్యక్షులు డీమ్స్ రాజు, నియోజకవర్గ ఇన్చార్జ్ కట్ట శ్రీనివాసరావు, ఆంధ్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కలగర్ల సత్యనారాయణ , మెంటాడ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నగేష్ ,పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.





